రైతు కంట కన్నీరు..!



పశువుల మేతకు విడిచిపెట్టిన పంటపొలాలు

- సాగునీరు లేక ఎండిపోతున్న పొలాలు
- పశువులకు మేతగా విడిచిపెడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

జలుమూరు: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో సాగునీరు లేకపోవడంతో ఎండిపోయి పగుళ్ల దేరుతున్నాయి. దీంతో కొద్దిరోజుల్లో చేతికందాల్సిన పంటలో పశువులను మేతకు విడిచిపెడుతున్నామని వాపోతున్నారు. మండల పరిధి జలుమూరు, కోనసింహాద్రిపేట, నామాలపేట, పాగోడు, చెన్నాయవలస, వెలుసోద, కరవంజ, గుగ్గిలి, తమ్మయ్యపేట, రామయ్యవలస, గొటివాడ, సుబ్రహ్మణ్యపురం తదితర గ్రామాలతో పాటు సారవకోట మండలంలోని బుడితి, బద్రి, చీడిపూడి తదితర గ్రామాల్లోని పంటలకు ఆఖరు తడి లేకపోవడంతో ఈ ఏడాది రైతులు ఆశలు వదులుకున్నారు.

5 వేల ఎకరాల్లో వరిసాగు

సీజన్ ప్రారంభంలో వంశధార ఎడమ కాలువ ద్వారా అనుబంధ కాలువల నుంచి సాగునీరు అందడంతో రెండు మండలాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరిపంట వేశారు. అప్పట్లో సాగునీటికి కొరత రానివ్వమని పాలకులు, అధికారులు రైతులకు హామీ ఇవ్వడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. కానీ ప్రస్తుతం కీలక దశలో సాగునీరు అందకపోవడంతో అన్నదాత కన్నీరు పెడుతున్నాడు. అప్పట్లో కూటమి నాయకులు, అధికారులు చెప్పడంతో సాగు చేయడమే వీరికి శాపంగా మారింది. ఇదిలా ఉండగా కాలువ దిగువన ఉన్న టెక్కలి, కోటబొమ్మాళి మండలాలకు డబ్బులు తీసుకొని సాగునీరు విడిచిపెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ ఏడాది నష్టాలు తప్పవని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి సాగునీరు అందిస్తే కొంతవరకు అయినా పంటను దక్కించుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

నష్టపోతాం



రబీలో వంశధార కాలువ ద్వారా నీరు వస్తుందని ఆశించి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాము. ప్రస్తుతం మరో 10 రోజుల్లో పంట చేతికి రావాల్సి ఉంది. కానీ గత 15 రోజులుగా నీరు నిలుపుదల చేశారు. దీనివలన పంట ఎండిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరు విడిచిపెట్టాలి. లేకుంటే నష్టపోతాం.

– ముప్పాల రాము, జలుమూరు

పశువుల మేతకు వదిలేశాం



సాగునీరు వస్తుందని ఆశించి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. కానీ గత 20 రోజులుగా నీరు లేకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో చాలా వరకు పొలాలను పశువుల మేతకు విడిచిపెట్టాము. అధికారులు స్పందించి ఇప్పటికైనా నీరు విడిచిపెడితే పెట్టుబడులు కొంతవరకు అయినా రావచ్చుననే ఆశతో ఉన్నాము.

– దామ మన్మథరావు, పాగోడు

నీటి నిల్వలు లేవు

వంశధార కాలువ ద్వారా రబీ పంట వేసే రైతులకు బ్యారేజీలో నీరు నిల్వ లేకపోవడంతో సాగునీరు ఇవ్వలేకపోతున్నాం. రైతులకు సాగునీరు లేక పలు ఇబ్బందులు పడుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. నదిలో కూడా కనీస నిల్వలు లేకపోవడంతో ఈ దుస్థితి వచ్చింది.

– జె.అప్పల రెడ్డి, జేఈ, జలుమూరు

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: గత పది నెలల కాలంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ అన్నారు. తిరుపతిలో మే నెలలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్యాయం చేస్తోందన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలను తీసివేసి చిరుద్యోగుల కుటుంబాల్లో చీకటిని నింపుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం సురేష్

పాతపట్నం: ప్రభుత్వం అందజేస్తున్న జీడి, మామిడి మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జి.సురేష్ సూచించారు. మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉచితంగా అందజేస్తున్న మొక్కల పెంపకంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రైతు ఆర్.రాము ఉపాధి హామీ పథకంలో భాగంగా మూడేళ్ల క్రితం 37 మామిడి మొక్కలను తీసుకుని పెంచారన్నారు. ఇప్పుడు రెండు మామిడి మొక్కలు కాపుకు వచ్చాయని తెలియజేశారు. సమావేశంలో వెంకటరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

కొత్తూరు: పెంచిన విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ముందు సీపీఎం నేతలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన చార్జీలను తగ్గించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ట్రా అప్ పేరుతో పెంచిన చార్జీల వలన వినియోగదారులపై రూ.17 వేల కోట్లు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని దుయ్యబట్టారు. చార్జీలు తగ్గించకుంటే భవిష్యత్‌లో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు లప్పన్న, మోహన్, లక్ష్మణరావు, దుర్గారావు, కృష్ణ, రామారావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే అసహనం

కొత్తూరు: స్థానిక సీహెచ్‌సీని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మందుల నిల్వలను పరిశీలించారు. అయితే నిల్వల లెక్కింపు సరిగా లేకపోవడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రోగులకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ ధర్మాన కిషోర్ తదితరులు ఉన్నారు.



మందుల నిల్వలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



సారవకోట: అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న బ్యాంకు సిబ్బంది



బూర్జ: ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు



హిరమండలం: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 23 గ్రామ పంచాయతీల నుంచి రుణాల కోసం 428 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 322 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలియజేశారు.

నరసన్నపేట: మండలంలోని 102 యూనిట్ల బీసీ రుణాలకు సంబంధించి 710 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేపట్టారు. కార్యక్రమంలో ఏవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 299 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీవో మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని 35 పంచాయతీలకు 70 యూనిట్లు మంజూరు కాగా, 345 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూల్లో 522 మంది పాల్గొన్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మొత్తం 589 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయని చెప్పారు. వివిధ బ్యాంక్‌ల సిబ్బంది, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

జలుమూరు: బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాలను ఆయా బ్యాంక్‌లకు అందజేస్తామని ఎంపీడీవో కె.అప్పల నాయుడు తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 378 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 56 యూనిట్లకు గాను 397 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు తెలియజేశారు.

సరుబుజ్జిలి: బీసీ కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.పావని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తప్పకుండా యూనిట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల మేనేజర్లు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన నేడు

ఆమదాలవలస రూరల్: మండలంలో బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం జరుగుతుందని ఎంపీడీవో రోణంకి వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు ఆమదాలవలస మండల పరిషత్ కార్యాలయానికి లబ్ధిదారులు హాజరవ్వాలని సూచించారు.

కొత్తూరు: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 69 బీసీ రుణాల యూనిట్లు మంజూరు కాగా, 488 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే దరఖాస్తుదారులు మూడు జతల జిరాక్స్‌లు, ఫొటోలు తీసుకురావాలన్నారు.



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎంపీడీవో పావని



నరసన్నపేట: ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు



జలుమూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలనాయుడు

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యా విధానం గురించి తల్లిదండ్రులకు వివరించారు.

బైపీసీతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డాక్టర్ సంధ్యారాణి

నరసన్నపేట: ఇంటర్మీడియట్‌లో బైపీసీ గ్రూప్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డాక్టర్ ఎల్.సంధ్యారాణి అన్నారు. జూనియర్ కళాశాలల్లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఎంసెట్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. పారా మెడికల్ కోర్సులు బైపీసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయన్నారు. అగ్రికల్చరల్ బీఎస్సీ చేయడం ద్వారా వ్యవసాయ శాఖలో అధికారులుగా, బ్యాంకుల్లో రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్లుగా స్థిరపడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సజావుగా నిర్వహించారు. దీనిలో భాగంగా బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తి నాయుడు, బి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రామారావు

పాతపట్నం: నాటుసారా రహిత మండలంగా పాతపట్నంను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సారా నిర్మూలనపై మండల కమిటీని శుక్రవారం నియమించారు. మండల స్థాయి కమిటీ చైర్మన్‌గా తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, సభ్యులుగా ఎంపీపీ దొర సావిత్రమ్మ, పాతపట్నం సీఐ వి.రామారావు, ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు, ఎంపీడీవో పి.చంద్రకుమారిలను నియమించామని తెలిపారు.

పక్కాగా వార్షిక పరీక్షలు



పరీక్ష పత్రాలు పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఏప్రిల్ 7వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు పక్కాగా నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్న పరీక్ష ప్రశ్నా పత్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నాపత్రాలు పరీక్షకు ఒక గంట ముందు అందజేయడం జరుగుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సిలబస్ రివిజన్ చేసి డైలీ పరీక్షలు నిర్వహించాలన్నారు.

విజయవంతం చేయాలి

నరసన్నపేట: ఈనెల 31వ తేదీన శ్రీకాకుళంలో జరగనున్న పోరుబాట సదస్సును విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. యూటీఎఫ్ ఉత్తరాంధ్ర నాయకత్వం సదస్సుకు సన్నాహాలు చేస్తోందన్నారు. విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. దీంట్లో రాష్ట్ర సంఘ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ట్రాఫిక్ ఇబ్బందులు



కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డును వ్యాపారులు ఆక్రమించడం వలన భారీ వాహనాలకు అవస్థలు తప్పడం లేదు. భారీ వాహనాలు మలుపు వద్ద టర్న్ చేయడం అవ్వకపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– కొత్తూరు

ప్రయాణికుల అవస్థలు



ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో ఉన్న బస్టాండ్‌ను కొంతమంది వ్యక్తులు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. బస్టాండ్‌లో ధాన్యం బస్తాలను నిల్వ చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం బస్తాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

సాగునీటి కష్టాలు



సరుబుజ్జిలి మండలంలోని యరగాం – పురుషోత్తపురం వంశధార ఓపెన్ హెడ్ ఛానల్ ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా సుమారు 14 కిలోమీటర్ల మేర 6,300 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రెడ్డి శాంతికి అభినందనలు



రెడ్డి శాంతిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మెంబర్‌గా నియామకమైన పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పలువురు అభినందనలు తెలిపారు. కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వసుము లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దూళి అప్పన్న, మంగి నరసింహం రెడ్డి, బూరాడ సంజీవరావు, సిరిపురం హరీష్ తదితరులు శుక్రవారం ఆమెను పాతపట్నంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావులు అన్నారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పార్టీ స్టేట్ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా ఎంపిక చేయడంతో, పాతపట్నంలో ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

ఆశీల వేలంపాట ఖరారు



ఆమదాలవలస: వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ఆమదాలవలస: పట్టణంలో ఆశీల వసూళ్లకు నిర్వహించే వేలంపాట ఎట్టకేలకు ఖరారయ్యింది. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక సంఘ మేనేజర్ బిసాయి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి మార్కెట్ ఆశీల వసూళ్ల వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో గుత్తేదారులు ముగ్గురు పాల్గొన్నారు. బొడ్డేపల్లి దాలినాయుడు రూ.22.50 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నాడు. కాగా వేలంపాటను పోలీసులు సమక్షంలో నిర్వహించడం చర్చనీయాంశమైంది. ఎస్ఐ బాలరాజుతోపాటు పోలీసు సిబ్బంది వేలంపాట ముగిసిన వరకు అక్కడే ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల కేంద్రంలోని ఆశీల వసూళ్ల వేలంపాట సర్పంచ్ పడాల కృష్ణవేణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కొత్తూరుకు చెందిన కూనిబిల్లి అన్నపూర్ణమ్మ పేరున ఆశీల వసూళ్ల వేలంపాట ఖరారు చేసినట్లు ఈవోపీఆర్డీ వసంత కుమారి తెలిపారు. పాటలో 75 మంది పాల్గొన్నట్లు చెప్పారు. అన్నపూర్ణమ్మ అత్యధిక మొత్తానికి వేలంపాట పాడడంతో ఆమె పేరున ఖరారు చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పక్కాగా సర్వే చేపట్టాలి



బూర్జ: శిక్షణలో పాల్గొన్న మహిళలు



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరాజులు

సరుబుజ్జిలి: జీవనోపాధుల ప్రణాళిక సర్వే పక్కాగా చేపట్టాలని వెలుగు ఏపీఎం సీహెచ్ గోవిందరాజులు సూచించారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, సీసీలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పేడాడ మణెమ్మ, వెలుగు అకౌంటెంట్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీవోఏలు, ఎన్యూమరేటర్లకు శిక్షణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.బాబూరావు, ఎల్‌సీ గంగు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి భరణి

పాతపట్నం: చట్టాలపై బాలికలకు అవగాహన అవసరమని శ్రీకాకుళం ఎక్సైజ్ స్పెషల్ జ్యుడిషియల్ జడ్జి డి.భరణి అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా సమస్య వచ్చినప్పుడు భయపడకుండా స్పందించి, ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.లావణ్య, బార్ ప్రెసిడెంట్ బీఈ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వి.అర్చన, న్యాయవాదులు ఎం.రామారావు, ఎ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ ఎలా..?



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు: ఏప్రిల్ నెలలో బియ్యం అలాట్‌మెంట్ తక్కువగా ఇచ్చారని, అలాంటప్పుడు లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేయగలమని రేషన్ డీలర్లు వాపోయారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో తహసీల్దార్ జెన్ని రామారావు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు తమ ఆవేదన తెలియజేశారు. ఈకేవైసీ పేరుతో ప్రతీ డిపోకు 15 నుంచి 20 ప్యాకెట్ల వరకు బియ్యం తక్కువగా వచ్చాయన్నారు. ఇలా అయితే పంపిణీ సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందించి డీలర్ల సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ షరీఫ్, రెవెన్యూ పరిశీలకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.